

29 నుంచి విద్యుత్ టారిఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకూ చేపట్టనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఏలూరులోని విద్యుత్ భవన్‌తోపాటు తాడేపల్లిగూడెం, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురం కార్యాలయాల నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ రెండు గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో ముందుగా నమోదు చేసుకున్న వారి అభ్యంతరాలు మాత్రమే స్వీకరిస్తారని తెలిపారు.

ఏం అభివృద్ధి చేశారో చెప్పండి?

చెవిలో పువ్వులు పెట్టుకుని మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రజలను ముఖ్యమంత్రి జగన్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అభివృద్ధి పేరుతో మోసం చేశారని, న్యాయం చేయాలని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు కోరారు. మంగళవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, నేతలు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవనాయుడు మాట్లాడారు. ముదునూరి ప్రసాద్ రాజు అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. నరసాపురంలో అభివృద్ధి కంటే అవినీతి ముందంజలో ఉందన్నారు. జిల్లా కేంద్రాన్ని ఎంఎల్ఎ తన చీఫ్‌విప్ పదవి కోసం అమ్మేసుకున్నారన్నారు. నరసాపురానికి మెడికల్ కాలేజీ మంజూరైందని, ఆర్భాటాలు చేసి పాలకొల్లు తరలించారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా తాగునీరు, మొల్లపర్రు రెగ్యులేటర్, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వియర్ ఛానల్, శేషావతారం కాలువ ఆధునికీకరణ పనులను, ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభించలేదని తెలిపారు. ప్రసాద్‌రాజు నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలియజేయాలన్నారు. తాను బహిరంగ వాదనకు సిద్ధమని సవాల్ విసిరారు.



చెవిలో పూలు పెట్టుకుని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మాధవనాయుడు, నేతలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

సచివాలయ ఉద్యోగుల వివరాలివ్వండి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పని సర్దుబాటుకు సచివాలయ ఉద్యోగుల వివరాలను సంబంధిత శాఖాధిపతులు వెంటనే అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె సచివాలయ ఉద్యోగుల శాఖాధిపతులతో సమావేశమై ఉద్యోగులను రేషన్‌లైజేషన్ ప్రక్రియలో సర్దుబాటుపై సమీక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది కొరత ఉన్న సచివాలయాలకు ఇతర సచివాలయాల నుండి సిబ్బందిని రేషన్‌లైజేషన్ ప్రక్రియపై పని సర్దుబాటుకు నియమించాలన్నారు. దీనికి సచివాలయాల వారీగా ఆయా శాఖాధిపతులు, సిబ్బంది వివరాలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, డిఎఒ జెడ్.వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె.శ్యామల, సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, పిఆర్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఉద్యాన శాఖాధికారి ఎ.దుర్గేష్, పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, మత్స్య శాఖాధికారి ఆర్‌విఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి 26న ట్రాక్టర్ ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం


కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న నిర్వహించబోయే ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. మోడీ ఇచ్చిన హామీ మేరకు కార్మిక, రైతు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్, ఎస్‌కెఎం సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, జక్కంశెట్టి సత్యనారాయణ, తమ్మినీడి నాగేశ్వరరావు, మామిడిశెట్టి రామాంజనేయులు, బి.వాసుదేవరావు, చెల్లబోయిన రంగారావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, రైతుల పంటలకు గిట్టుబాటు ధరపై పార్లమెంట్లో చట్టం చేస్తానని, విద్యుత్ సంస్కరణల నుంచి వ్యవసాయ రంగాన్ని మినహాయిస్తానని, ఢిల్లీ ఉద్యమంలో చనిపోయిన రైతు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటానని, అక్రమ కేసులు ఎత్తివేస్తానని, నాలుగు లేబర్ కోడ్లు ఎత్తివేస్తానని మోడీ ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని విమర్శించారు. రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని, వ్యవసాయ కూలీలకు రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కౌలురైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు 26న రైతులు, కౌలు రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ట్రాక్టర్లు ఇతర వాహనాలతో భీమవరం జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. విస్సాకోడేరు మహాలక్ష్మి రైస్‌మిల్లు వద్ద నుండి ఈ ర్యాలీని ప్రారంభించి బస్ డిపో, కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ వరకూ నిర్వహించనున్నామన్నారు.



అభివాదం చేస్తున్న రైతు కార్మిక నేతలు



పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి



అధికారులతో మాట్లాడుతున్న జెసి రామ్ సుందరరెడ్డి

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పెండింగులో ఉన్న రీసర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుండి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న రీసర్వేకు సంబంధించిన పది ఫార్మేట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నర్సాపురం మండలం చిట్టవరంలో ఫైనల్ ఆర్ఒఆర్ పెండింగ్ వెంటనే క్లియర్ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. పెనుమంట్ర మండలం జుత్తిగ, పెనుగొండ మండలం నడిపూడి, పాలకోడేరు మండలం గరగపర్రు, నరసాపురం మండలం సరిపల్లి గ్రామాల్లో కరెక్షన్ మాడ్యూల్ వెంటనే పూర్తి చేయాలన్నారు. రెండో దశ స్టోన్ ప్లాంటేషన్లో పెండింగులో ఉన్న గ్రామాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. మూడో దశలో స్టోన్ ప్లాంటేషన్‌లో పెనుగొండ మండలంలో మునపర్రు, తామరాడ, ఇల్లపర్రు, వడలి గ్రామాలు నూరు శాతం పూర్తి చేశారని తెలిపారు. ఫొటో అప్‌డేషన్ పెండింగ్‌లో పాలకోడేరు మండలం గరగపర్రు, పోడూరు మండలం కవిటం గ్రామాలు ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అసైన్డ్ ఫ్రీ హోల్డ్ భూములు పనులు వేగవంతం చేయాలని ఆర్‌డిఒలను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్య, డిప్యూటీ ట్రెయినీ కలెక్టరు కానాల మాధూర్ తదితరులు పాల్గొన్నారు

చేతివృత్తిదారులు ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

గీత వృత్తిని రక్షించుకోవడానికి చేతివృత్తిదారులంతా ఐక్యంగా పోరాడాలని చేతివృత్తిదారుల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'గీత కార్మిక సమస్యలు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో చేతివృత్తిదారుల సంఘాల నాయకులు మాట్లాడుతూ జగన్ సిఎం అయ్యాక చేతి వృత్తులను రక్షించకపోగా భక్షించారన్నారు. కులాల పేరుతో కార్పొరేషన్ పెట్టి నిధులివ్వకుండా ఉత్సవ విగ్రహాల్లా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటివల్ల వృత్తిదారులకు న్యాయం జరగలేదన్నారు. గీతవృత్తిపై అనేక వందల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, అటువంటి వృత్తిని జగన్మోహన్‌రెడ్డి తన విధానాలతో సంక్షోభంలోకి నెట్టేశారన్నారు. గీతవృత్తి పరిరక్షణకు సంఘటిత పోరాటాలు చేయాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో రజక సంఘం రాష్ట్ర నాయకులు మడక రాజు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పి.మురళీ, కల్లుగీత సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బల వీర్రాఘవులు ప్రజాసంఘాల మండల కన్వీనర్ గుబ్బల గోపి, కల్లుగీత సొసైటీ అధ్యక్షులు కాసాని శ్రీనివాసు, కట్టా వెంకటేశ్వరరావు, గార రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - వీరవాసరం

పోలింగు కేంద్రాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం మండలంలోని చింతలకోటిగరువు, నడపనవారిపాలెం, తోలేరు, పడమటిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నడపనవారిపాలెం, పడమటిపాలెంలోని పాఠశాల భవనాల వద్ద మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లకు వెళ్లడానికి రావడానికి వేర్వేరు ద్వారాలు ఉండాలని, ఒకటే పెద్ద ద్వారం ఉంటే పార్టీషన్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉండాలని, ఒకే మరుగుదొడ్డి ఉంటే పురుషులకు తాత్కాలిక టాయిలెట్‌ను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. విభిన్నప్రతిభావంతులకు వీలుగా ర్యాంపును సిద్ధం చేయాలన్నారు. లైటింగు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అవసరమైన చోట హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తుది ఓటర్ల జాబితా ఆధారంగా ప్రతి మండలంలో సంబంధిత తహశీల్దార్లు రెండు, మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్ల పరిశీలన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, తహశీల్దార్ ఎం.సుందర్రాజు, ఎంపిడిఒ కె.జ్యోతి, మండల సర్వేయరు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు, బిఎల్ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అభినందనలు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

42 రోజులుగా పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని సమ్మెను జయప్రదం చేసి, కోర్కెలు సాధించుకున్న అంగన్వాడీలకు సిపిఎం జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. సమ్మెకు సంఘీభావం తెలిపిన సంఘాలకు, ప్రజలకు, లబ్ధిదారులకు, పిల్లల తల్లిదండ్రులకు, రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపింది. అంగీకరించిన జీతాల పెంపు, ఇతర అంశాల అమలుకు ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఎటువంటి కక్షసాధింపులకు పాల్పడకుండా ఉద్యోగుల హక్కులను కాపాడాలని కోరింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని 42 రోజులుగా సమ్మె చేసిన కాలంలో ప్రభుత్వం నుంచి అనేక విధాలుగా అంగన్వాడీలు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టించి, బెదిరించిన ప్రభుత్వం అబాసు పాలైందని తెలిపారు. కలెక్టర్లు నోటీసులిచ్చినా అంగన్‌వాడీలు బెదరలేదని తెలిపారు. అంగన్‌వాడీ, సిఐటియు, సిపిఎం నాయకులకు అనేకసార్లు నోటీసులిచ్చి, గృహ నిర్బంధాలు, అరెస్టులు చేశారని, ఇది సిగ్గుచేటని విమర్శించారు. ఇన్ని నిర్బంధాలను, రాష్ట్ర ప్రభుత్వ కుయుక్తులను సంఘం అండతో ఐక్యంగా ఎదిరించడం అభినందనీయమని తెలిపారు. కార్మికుల ఐక్యత, ఇతర సంఘాల, రంగాల కార్మికుల సంఘీభావం, ప్రజల మద్దతు భవిష్యత్‌లో మరింత అవసరం కానుందని సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

ఉండి: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చుకునేందుకు సమ్మెకు పూనుకున్న అంగన్వాడీలకు 43 రోజుల నుంచి అండగా నిలిచిన సిఐటియు నాయకులకు, టిడిపి, జనసేన నాయకులకు అంగన్వాడీల మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.చైతన్య, డి.సత్యవేణి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తమ డిమాండ్లు నెరవేర్చేందుకు ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు.



విచారణ జరిపారు.. పరిష్కారం మరిచారు..!

'వ్యవసాశాఖ జిల్లా అధికారి వై.రామకృష్ణకు అండగా నిలుస్తున్నది ఎవరు? ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు అందిన ఫిర్యాదుపై విచారణ జరిపి వాస్తవాలు నిర్ధారణ అయినప్పటికీ సమస్యను పరిష్కరించకపోవడానికి కారణం ఏమిటీ.. ఆ శాఖ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారులు తేలిగ్గా తీసుకుంటున్నారా.. తమగోడు విన్పించేందుకు వ్యవసాయ శాఖ మంత్రిని ఉద్యోగులంతా కలవబోతున్నారా' అంటే అవుననే సమాధానం వస్తోంది.

జిల్లా వ్యవసాయశాఖ ఉద్యోగుల్లో తీవ్ర వేదన

జిల్లా అధికారి రామకృష్ణ తీరుపై ఉద్యోగులంతా ఫిర్యాదు

విచారణ అనంతరం చర్యలు శూన్యంపై సర్వత్రా చర్చ

తమ గోడు వినేవారు లేరంటూ ఉద్యోగుల్లో అంతర్మథనం

నిరసనగా ఆ శాఖ వాట్సాప్ గ్రూప్ నుంచి ఉద్యోగులంతా ఎగ్జిట్

నేడు వ్యవసాయ శాఖ మంత్రిని కలిసేందుకు సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో దాదాపు 80 శాతం ప్రజలకు వ్యవసాయమే ఆధారం. ఏలూరు జిల్లాలో వరితోపాటు, పామాయిల్, పొగాకు, మొక్కజొన్న, మామిడి వంటి పంటలతోపాటు కోకో వంటి అనేక ఉద్యాన పంటలను రైతులు పండిస్తున్నారు. జిల్లాలో అత్యంత కీలకమైన శాఖల్లో వ్యవసాయ శాఖ ఒకటి. ఇక్కడి ప్రజలు నిరంతరం ఆ శాఖ అధికారులతో మమేకమవుతారు. ప్రజలకు అత్యంత ప్రధానమైన శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీంతో ఆ శాఖ పనితీరుపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. జిల్లాల విభజన తర్వాత జిల్లా వ్యవసాయశాఖాధికారిగా వై.రామకృష్ణ నియమితులయ్యారు. రామకృష్ణ తమను తీవ్రంగా వేధిస్తున్నారని, బూతులు తిడుతున్నారని, ఆయన వేధింపులు తాళలేక ఇప్పటికే పలువురు ఉద్యోగులు మెడికల్ సెలవులు పెట్టి వెళ్లిపోయారని, ఇక భరించలేని స్థాయికి ఆయన వేధింపులు వెళ్లాయని, ఆయన వద్ద ఇక తాము పని చేయలేమంటూ జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగులంతా ఆ శాఖ కమిషనర్‌కు జనవరి మొదటి వారంలో ఫిర్యాదు చేశారు. ఆ శాఖ కమిషనర్ దీనిపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణను పిలిచి మాట్లాడినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్‌ను కూడా ఉద్యోగులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై ఆ శాఖ కమిషనర్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి ఉద్యోగులతో రెండు దఫాలుగా మాట్లాడారు. ఉద్యోగులను, జిల్లా అధికారి రామకృష్ణను కూర్చోబెట్టి సైతం మాట్లాడారు. ఈ విచారణలో ఉద్యోగులపై రామకృష్ణ ఏవిధంగా వేధింపులకు పాల్పడుతున్నారో ఆధారాలతో సహా సిబ్బంది విచారణాధికారి ముందు పెట్టినట్లు సమాచారం. గతంలో ఈయన అనంతపురంలోనూ ఇదేవిధంగా వ్యవహరించినట్లు అప్పట్లో ఆ జిల్లాలో చోటుచేసుకున్న ఆధారాలను విచారణాధికారి ముందుపెట్టినట్లు తెలిసింది. అధికారి, ఉద్యోగుల మధ్య రాజీ కుదరలేదు. నిబంధనల ప్రకారం విచారణ పూర్తయిన తర్వాత సదరు అధికారి రాతపూర్వకంగా నివేదికను ఉన్నతాధికారులు అందిస్తారు. విచారణలో ఉద్యోగులు చేసిన అంశాలపై వాస్తవాలు నిర్ధారణ అయినట్లు తేలితే జిల్లావ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. విచారణ జరిగి రెండోవారం గడుస్తున్నా ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి స్పందనా లేకుండా పోయింది. దీంతో వ్యవసాయశాఖలో ఉద్యోగుంతా తీవ్ర ఆవేదనలో కూరుకుపోయినట్లు తెలుస్తోంది. విచారణ జరిగినా సమస్యను ఎందుకు పరిష్కరించకుండా వదిలేశారో తెలియని పరిస్థితి నెలకొంది.

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసేందుకు సిద్ధం

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో వ్యవసాయ శాఖ ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో మునిగిపోయినట్లు తెలుస్తోంది. అందుకు నిరసనగా వ్యవసాయశాఖ అధికారుల వాట్సాప్ గ్రూపు నుంచి ఉద్యోగులంతా ఎగ్జిట్ అయినట్లు తెలిసింది. ఈ గ్రూప్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారితోపాటు కలెక్టర్, జెసి సైతం ఉంటారు. అంతేకాకుండా వ్యవశాయశాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డిని కలిసి తమగోడును వినిపించేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. సదరు అధికారికి అండగా నిలుస్తున్నది ఎవరనే దానిపై చర్చ నడుస్తోంది.

ఆక్వా సమస్యల పరిష్కారం కోరుతూ..

ఏప్రిల్‌లో చలో అసెంబ్లీ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏప్రిల్‌లో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించనున్నామని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతుల సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు చెప్పారు. మంగళవారం సంఘ భవనంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న పాలకొల్లులో నిర్వహించిన ర్యాలీలో గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారని తెలిపారు. ఫిబ్రవరిలో రెండు వేల మోటార్ సైకిళ్లతో పాలకొల్లు నుండి భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆక్వా రైతుల సమస్యలు మార్చి 31లోపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకపోతే ఏప్రిల్‌లో వెయ్యి కార్లలో చలో అసెంబ్లీ నిర్వహించి సిఎంకు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి బోనం చినబాబు, కోశాధికారి మేకా ఫణీంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాంధీ భగవాన్‌రాజు



మాట్లాడుతున్న ఎఎంసి ఛైర్మన్ లావణ్య

ఓటు వజ్రాయుధం : ఎఎంసి ఛైర్మన్

ప్రజాశక్తి - ఆచంట

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధమని ఐదేళ్లకొకసారి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలని ఆవశ్యకత యువతిది యువకులపై ఉందని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. వల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎలక్ట్రోల్ ఓటింగ్ యంత్రం (ఇవిఎం)పై అవగాహన కార్యక్రమం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ జయలలిత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్యతో పాటు ఓటర్లు పాల్గొని ఇవిఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తున్న దేశం మనది అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కొనసాగాలంటే ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. యువత ఓటు హక్కు కలిగి ఉండి, ఓటు వేయడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జివి.సత్యనారాయణ, వైసిపి నాయకులు ఏనుగుపల్లి వరప్రసాద్, రాగాన శ్రీను, కుసుమే సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసిపి గెలుపు తథ్యం

రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్

ప్రజాశక్తి - ఆచంట

పాలకొల్లులో వైసిపి గెలుపు తథ్యమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల హరిగోపాల్‌రావు ను పార్టీ కార్యాలయంలో కిషోర్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పాలకొల్లులో వైసిపి ఘన విజయం సాధించాలని ఆకాంక్షిచారు. కార్యక్రమంలో వైసిపి యువజన జిల్లా కార్యదర్శి దేవిరెడ్డి రాంబాబు, మండల కార్యదర్శి మనవర్తి విజయ్‌కుమార్, బాలిన వీరాస్వామి, చామన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి

ప్రజాశక్తి - పోడూరు

కుట్టు మిషను శిక్షణతో మహిళలకు చక్కని ఉపాధి ఉంటుందని జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు అన్నారు. స్థానిక లేసు పార్క్ భవనంలో మంగళవారం పిఎం విశ్వకర్మ పథకంలో భాగంగా మొదటి విడత కుట్టు మిషను శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిఎం విశ్వకర్మ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుట్టు మిషను నేర్చుకుని స్వంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వం రుణసాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణ రాజు, దేవస్థానం ఛైర్మన్ పోడూరు సత్యసాయి బాబా పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - నరసాపురం

భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి 60వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నరసాపురం పట్టణానికి చెందిన ఆదిపరాశక్తి నృత్య అకాడమీ ఉపాధ్యక్షులు రంగినీడి సుబ్బారావు, అడ్మినిస్ట్రేటివ్ భరణి ఆధ్వర్యంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అన్నమయ్య కీర్తనలు, మహిషాసుర మర్ధిని స్తోత్రం, శివతాండవం, దీపాలు, పూర్ణ కలశాలతో ఆదిపరాశక్తి నృత్య అకాడమీ సంస్థ నాట్యాచారిణి, డైరెక్టర్, నాట్య సరస్వతి అవార్డు గ్రహీత అనంతలక్ష్మి శిష్య బందం చేసిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా అనంతలక్ష్మిని నీరుల్లి, కూరగాయ, పండ్ల వర్తక సంఘం అధ్యక్షులు గోవిందరావు పట్టు వస్త్రాలతో సత్కరించి ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులకు ధృవ పత్రాలు అందజేసి అభినందించారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతిస్తోందని వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో సిఎం సహాయ నిధి సంబంధించి రూ.60,000 చెక్కును పాలకొల్లులోని మావుళ్ళమ్మ పేటకు చెందిన తాడి సత్యవతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కో కన్వీనర్ కెల్లా దుర్గారావు, జిల్లా యువజన విభాగ జనరల్ సెక్రటరీ పెచ్చెట్టి కృష్ణాజీ, లక్ష్మీ పాలెం పాల్గొన్నారు.

హెచ్‌ఐవి పిల్లలకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మానవత ఆధ్వర్యంలో హెచ్‌ఐవి బాధిత పిల్లలకు ప్రతినెలా క్రమం తప్పకుండా దాతల సహకారంతో పౌష్టికాహారం అందించడం అభినందనీయమని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్లో 30 మంది హెచ్‌ఐవి పిల్లలకు పౌష్టికాహారం అందజేసి మాట్లాడారు. తాటిపాక వేద విద్యాసంస్థల ప్రిన్సిపల్ అత్తోట రవికుమార్ ఆర్థిక సహాయంతో పౌష్టికాహారం అందజేశారు. ఆయనను ఎంఎల్‌ఎపాటు పలువురు కొనియాడారు. మానవత అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్‌ఐవి పిల్లలకు పౌష్టికాహారంతో పాటు క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాల్లో నూతన దుస్తులను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మానవత కన్వీనర్ ముత్యాల రామారావు, కోశాధికారి మద్దాల వాసు, సభ్యులు బొక్క రమాకాంత్, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, కొమ్ముల మురళీకృష్ణ, చిలుకూరి చిట్టి బుల్లెమ్మ, విన్నకోట వెంకటరమణ, ముత్యాల శ్రీ ప్రదీప్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 24న తణుకు ఇపిడిసిఎల్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల ఫోరం ఛైర్మన్, విశ్రాంతి న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగే వేదికలో సాంకేతిక సమస్యలపై బి.జనార్దన్‌రావు, ఆర్థిక సంబంధాల పరిష్కారంపై డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ వివరిస్తారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కార వేదికను తణుకు డివిజన్లోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొనసాగిన 'ప్రజలతో పితాని'

ప్రజాశక్తి - పెనుగొండ


మండలంలో ప్రజలతో పితాని కార్యక్రమం మంగళవారం కొనసాగింది. ఇలపర్రు గ్రామంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆంబోతుల దిబ్బ, గుడిపాడు, ఎస్‌సి కాలనీల్లో ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ముఖ్యమంత్రి లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలో పది కోట్ల 15 లక్షల రూపాయలతో జరిగిన అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించి మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా తోకతిప్పలో రూ.18 లక్షలతో నిధులతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.8.30 లక్షలతో కొల్లాటి పెద్దిరాజు ఇంటి నుంచి కొల్లాటి లక్ష్మణస్వామి ఇంటి వరకు నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అలాగే రూ.ఐదు లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దెయ్యాల తిప్ప గ్రామంలో రూ.పది లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.9 కోట్లతో దిరుసుమర్రు హరిజనవాడ నుండి కోమటితిప్ప వరకూ ఐదు కిలోమీటర్లకుపైబడి నూతనంగా నిర్మించిన బిటి, సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశారన్నారు. భీమవరం మండలంలో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను, పట్టాలను ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి సంఘం జిల్లా అధ్యక్షులు పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.



సిసి రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

గరగపర్రు కేసులో అదనంగా సెక్షన్లు చేర్చాలి

ఎస్‌పిని కోరిన గరగపర్రు బాధిత దళితులు

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు సాంఘిక బహిష్కరణ సమయంలో నిందితులపై పెట్టిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో అదనంగా సెక్షన్లు చేర్చాలని గరగపర్రు బాధిత దళితులు కోరారు. గొల్లలకోడేరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్‌ను గరగపర్రు బాధిత దళితులు మంగళవారం కలిసి సమస్యలను విన్నవించారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టంలోని సెక్షన్ 3,1, (టి) సెక్షన్ 3,1 (వై)లను చేర్చి నిందితులను శిక్షించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో సంబంధించిన సెక్షన్లు చేర్చేవిధంగా కోర్టు అనుమతి తీసుకుని, మెమో వేయాలని ఎస్‌పిని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. తమకు రావాల్సిన పరిహారం అందించే విధంగా కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కటికితల యోహాను, దాసరి ఇస్సాకు, గొంతి చిన్ని, కొనాల ఎలీషా, డొల్ల పేతురు, ఏరిచర్ల రాజేష్, కె.ఏసు, అద్దంకి సురేష్‌బాబు ఉన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశవ్యాప్తంగా గత డిసెంబర్ 24న జరిగిన రెండో దశ క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో చిన్నతాడేపల్లి శ్రీచైతన్య విద్యార్థులు బంగారు, నగదు బహుమతులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతికి చెందిన మోనిష్, హవిష్, తొమ్మిదో తరగతి చదువుతున్న లిఖిత, చిన్మయి ఆశ్రిత, హర్షవర్ధిని నగదు, బహుమతులు సాధించారు. వారికి నగదు, పతకాలతో పాటు, ప్రశంసా పత్రం అందజేశారు. 14 మంది బంగారు పతకాలు సాధించగా మరో 34 మందికి ప్రశంసా పత్రాలు లభించాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎజిఎం పార్థసారధి, రీజనల్ ఇన్‌ఛార్జి ఉదయభాస్కర్, రీజనల్ కోఆర్డినేటర్ రామారావు ఆయా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ నాగార్జున, సిబ్బాచ్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, ప్రయిమరీ ఇన్‌ఛార్జి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ప్రణతికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గుజరాత్ రాష్ట్రంలోని నౌసారి వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయస్థాయి హార్టికల్చర్ కాంక్లేవ్ 2024 కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ వారిచే పూల శాస్త్రంలో పిహెచ్‌డి కోర్సులో అత్యుత్తమ థీసిస్ (పరిశోధనా పత్రం) సమర్పించిన యువ శాస్త్రవేత్తలకు జాతీయస్థాయి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ క్రమంలో బడ్డింగ్ సైంటిస్ట్ కేటగిరిలో 2021-22 సంవత్సరానికి గాను అత్యుత్తమ యువ పరిశోధక శాస్త్రవేత్త పురస్కారాన్ని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాలలో ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పసుపులేటి ప్రణుతికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రణతిని ఉద్యాన కళాశాల సీనియర్ ప్రొఫెసర్ టి.సుశీల, కొవ్వూరు ఉద్యాన పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త రవీంద్రకుమార్, ఉపకులపతి టి.జానకి రామ్ అభినందించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ లిల్లీ మొక్కలోని మూడు భాగాల నుండి టిష్యూ కల్చర్ విధానంలో అధిక సంఖ్యలో నాణ్యమైన అంటు మొక్కలు అభివృద్ధి చేసి, ఉద్యాన రైతులకు అందించే విధానం రూపొందించిన పసుపులేటి ప్రణతి, ఆమెకు మార్గదర్శిగా వ్యవహరించిన సీనియర్ శాస్త్రవేత్త కె.రవీంద్రకుమార్‌ను అభినందించారు. ఇలాంటి పరిశోధనలు మరిన్ని రావాలన్నారు.



పురస్కారం అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రణతి

ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు స్థానిక కళ్యాణి మానసిక వికలాంగుల పాఠశాలలో వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి చిన్నారులతో కేక్ కట్ చేయించి లోకేష్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు నళినీ బాబూరావు, బండి స్వర్ణలత, రంగినీడి భరణి, టి.భారతి, టి.అరుణ పాల్గొన్నారు.

పాలకొల్లు : నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 మందికి పైగా వికలాంగులకు 25 కేజీల చొప్పున బియ్యం, దుప్పట్లు అందజేశారు. రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో యువకులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఎ కేక్ కట్‌చేసి మీడియాతో మాట్లాడారు.

భీమవరం రూరల్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో టిడివి, జనసేన నాయకులు కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, చనమల్ల చంద్రశేఖర్ మాట్లాడారు. జనసేన నాయకులు బండారు శ్రావణి, టిడిపి నాయకులు మెరగాని నారాయణమ్మ, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జున రావు (బాబ్జి) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బలుసులమ్మ తల్లి, అభయ ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం తాలూకాఫీస్ సెంటర్లో అన్నా క్యాంటీన్ వద్ద కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ కార్యకర్తలకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించిన ఘనత లోకేష్‌దే అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, పెంటపాడు అధ్యక్షులు కె.వెంకట్రావు పాల్గొన్నారు.

మొగల్తూరు : రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని టిడిపి నాయకులు నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తుల రామరాజు, ఎన్నారై కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడులు తెలిపారు. నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజలక్ష్మి, పొన్నపల్లి శివ, కలిదిండి కుమార్ బాబు పాల్గొన్నారు.

ఉండి : నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఉండి పార్టీ కార్యాలయంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ టిడిపి నాయకులు కాగిత మహంకాళి, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అపూర్వ స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేరిచర్ల కృష్ణంరాజు, ముదునూరి కృష్ణంరాజు, ఉండ్రు అబ్రహం, కునుకు శ్రీనివాస్, పోలుబోతు రాము, మజ్జి కృష్ణ ప్రసాద్, కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వికలాంగులకు దుప్పట్లు అందజేస్తున్న ఎంఎల్‌ఎ నిమ్మల

'ఉపాధి పనుల్లో రూ.23,319 వేలు దుర్వినియోగం'

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో ఉపాధి పనుల్లో అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజా వేదిక ద్వారా వెల్లడైంది. ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన డ్వామా పీడీ టివి.రాజేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ 2019 - 20 గాను బలుసులగొయ్యిపాలెంలో ఇళ్ల స్థలాల పూడికకు సంబంధించి జరిగిన అవినీతిపై వచ్చిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో అధికారులు తెలపాలని కోరారు. అప్పటి పీడీ దుండి రాంబాబు అవినీతిపై నిధులు రాబట్టడం జరుగుతుందని తెలిపారన్నారు. అయితే ఇప్పటి వరకూ అటువంటి చర్యలేవీ తీసుకున్నట్టు కనిపించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ప్రస్తుత డ్వామా పీడీ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో 2022-23 సంవత్సరానికి మొత్తం రూ.4.46 కోట్ల పనులు చేసినట్లు ప్రజావేదిక వద్ద వెల్లడించారు. మెటీరియల్ కాంపోండ్ నిధులు రూ.1.38 కోట్లు కాగా మిగిలిన రూ.3.08 లక్షల వేతనాలు రూపంలో కూలీలకు చెల్లించారు. రూ.23,319 వేలు అవినీతి జరిగినట్టు తనిఖీ విభాగం తేల్చింది. పలు పనుల్లో కూలీల సంతకాలు లేకుండా కూలీ చెల్లించినట్టు వెల్లడించారు. మండల వ్యాప్తంగా మొత్తం 10,444 మంది కూలీలు ఉండగా వారిలో 6,802 మందికి మాత్రమే పని కల్పించనట్టు తేల్చారు. అదేవిధంగా వడ్డిగూడెంలో అనర్హులకు పెన్షన్ అందుతున్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జ్యోతి, టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్ పాల్గొన్నారు.



ఉపాధి పనుల్లో అవినీతి పై ప్రశ్నిస్తున్న టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి - పెనుగొండ

ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పోలింగ్ బూత్‌లను ఇఎల్‌ఒ రాజేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ నేపథ్యంలో వడలి, మనమర్రు గ్రామంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలో అర్థకట్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి రుద్రరాజు శ్రీనివాసరాజు ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని బిపి, షుగర్ ఇతర పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఉప వైద్య అధికారి వరప్రసాద్ ఈ శిబిరంలో అన్ని విభాగాలనూ పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు, డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ సుష్మ పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న సర్పంచి

సాహిత్యం, సంగీతం జీవన తత్వానికి మార్గదర్శకాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆధ్యాత్మికత, సాహిత్యం, సంగీతం మానవుని జీవన తత్వానికి మార్గదర్శకాలని పిఠాపురం శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా అన్నారు. ఉమర్ ఆలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో స్థానిక త్యాగరాజ భవనం వద్ద మంగళవారం నిర్వహించిన 6వ పీఠాధిపతి కవిశేఖర ఉమర్ ఆలీషా 79వ వర్ధంతి సభకు ఆలీషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు ఆధ్యాత్మికత, సాహిత్యం, సంగీతం పట్ల జ్ఞానాన్ని పెంపొందించుకుని తన జీవన విధానంలో ఆచరిస్తే మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంత జీవనం పొందుతాడని తెలిపారు. ఉమర్ ఆలీషా సాహితీ సమితి ద్వారా భీమవరంలో 31 సంవత్సరాలుగా విశిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తూ సాహితీ సేవ చేస్తున్న సమితి సభ్యులను పీఠాధిపతి అభినందించారు. పురస్కార గ్రహీత వాసిలి వసంత కుమార్ మాట్లాడారు. అనంతరం పీఠాధిపతి ఉమర్ అలీషా పురస్కార గ్రహీతకు స్మారక పురస్కారాన్ని, 50,116 రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి దాయన సురేష్ చంద్రజీ, ఉపాధ్యక్షుడు త్సవటపల్లి మురళీకృష్ణ, కోశాధికారి వెంకటేశ్వర శర్మ పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

పలువురు వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ బోస్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి పివి.సుందరరామరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ నేతలు ఎంతమంది ఉన్నా నేతాజీనీ మించిన నాయకుడు లేడని చెప్పారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన స్వాతంత్ర సమరయోధుడని చెప్పారు. ఆయన చిత్రానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.